క్లుప్తంగా

మర్యాద పూర్వకంగా..



రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జ్యోతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేఎస్ జ్యోతి స్వాగతం పలికారు. బుధవారం స్థానిక జేఎన్ రోడ్డు గాయత్రీనగర్‌లో ఆయన్ని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ కార్యాలయానికి చెందిన సీహెచ్ శ్రీనివాస్, ఎస్ఎస్ లక్ష్మీకాంతి, కె.శంభుడు, లక్ష్మణ్, సూర్యం, త్రివేణి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర పనుల నిమిత్తం గురువారం స్థానిక తాడితోట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ బుధవారం ప్రకటించారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ స్థానిక కొత్తపేట, శ్యామలా సెంటర్, టి.నగర్, ఇన్నీస్‌పేట, సాయికృష్ణ సెంటర్, స్టేడియం రోడ్డు, తాడితోట, గాంధీపురం, రైల్వే స్టేషన్, ఆల్కాట్ గార్డెన్స్, బాలాజీపేట, ఐదుబళ్ల మార్కెట్, శంభూనగర్, ఐఎల్‌టీడీ సెంటర్, ఆవరోడ్డు, కొబ్బరి కాయల మార్కెట్, చెగిడిపేట, మంగళవారపుపేట, భారత బొమ్మల వీధి, అన్నపూర్ణా థియేటర్ రోడ్డు, మూడు సింహాల బొమ్మవీధి, నాగులచెరువు బజార్, అనుశ్రీ థియేటర్, గీతా అప్సర, చర్చ్‌పేట, మేదరపేట, మసీదు ప్రాంతం, సోమలమ్మ సెంటర్, గొల్లవీధి, మెయిన్ రోడ్డు, బెస్తవీధి, కేవీఆర్ స్వామి రోడ్, ఐదుబళ్ల మార్కెట్ తదితర ప్రాంతాలకు ప్రభావం ఉంటుందన్నారు.

నిబద్ధతతోనే గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న డీఐ దిలీప్‌కుమార్

కంబాలచెరువు: నిబద్ధతతో విధులు నిర్వర్తించే ప్రతి అధికారికీ గుర్తింపు ఉంటుందని డీఐ బి.దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక కందుకూరి వీరేశలింగం ఆస్తిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పోతుకూచి లక్ష్మీకృష్ణమోహన్ ఆ కోవకే చెందుతారన్నారు. పోతుకూచి ఉద్యోగ విరమణ సందర్భంగా విద్యాధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమక్షంలో పాఠశాల ఆవరణలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు ఎమ్‌వీఎమ్ సుబ్రహ్మణ్యం బుధవారం ఆయన్ని సన్మానించారు. ఈ సందర్భంగా డీఐ మాట్లాడుతూ కృష్ణమోహన్ అందరికీ సహాయ సహకారాలు అందించే వారన్నారు. ఉపాధ్యాయులు వరహాగిరి కృష్ణమోహన్, డాక్టర్ పుప్పాల బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో పనులు చేయించడం నేరం



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రత్యూషకుమారి

కంబాలచెరువు: స్థానిక క్వారీ మార్కెట్‌లో అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు డీఎల్ఎస్ఏ కార్యదర్శి, న్యాయమూర్తి కె.ప్రత్యూషకుమారి హాజరై మాట్లాడుతూ పిల్లల హక్కుల సంరక్షణ చట్టాలను వివరించారు. పిల్లలంతా కచ్చితంగా బడికి వెళ్లి చదువుకోవాలన్నారు. పిల్లలతో పనులు, భిక్షాటన చేయించడం నేరమన్నారు. అనంతరం జిల్లా న్యాయమూర్తి ఎం.మాధురి, కె.ప్రత్యూషకుమారి ప్యానెల్ లాయర్లు, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులతో మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. శిశు సంక్షేమ శాఖాధికారి కె.విజయకుమారి, ఎన్‌జీఓ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్‌లో వెబినార్

కంబాలచెరువు: స్థానిక శ్రీకందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి అధ్యక్షతన ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ బి.అనురాధ సూర్యకుమారి నిర్వహణలో అన్‌లీషింగ్ పవర్ ఆఫ్ ఎంప్లాయ్ బులిటీపై ఇంటర్నేషనల్ వెబినార్ బుధవారం జరిగింది. వెబినార్ నిర్వహణకు అనుమతినిచ్చిన కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డాక్టర్ పోలా భాస్కర్, ఆర్జేడీ డాక్టర్ చప్పిడి కృష్ణలకు ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలిపారు. వక్తలు మాట్లాడిన విషయంపై ఆంగ్ల అధ్యాపకుడు పీఎస్ఎస్ఎన్.దుర్గాప్రసాద్ విశ్లేషణ ఇచ్చారు. అధ్యాపకుడు కె.చిన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

చదువుకు పట్టాభిషేకం..

- ఆనంద డోలికల్లో యువ హృదయాలు
- 'నన్నయ' వర్సిటీలో పట్టాల పండగ



ఆనందంలో యువ తరంగాలు



గోల్డ్ మెడల్‌తో పాటు పీజీ పట్టా అందుకున్న విజయలక్ష్మితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కుటుంబ సభ్యులు

రాజానగరం: చదువులకు పట్టాభిషేకమిది.. నగర్వంగా జరుపుకొన్న పండగ ఇది. స్థానిక ఆదికవి నన్నయ యూనివర్సిటీలో పట్టాల పండగ అత్యంత అట్టహాసంగా జరిగింది. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కులపతి హోదాలో ఈ స్నాతకోత్సవంలో పాల్గొని, తమకు పట్టాలు అందజేయడం జీవితంలో అద్భుత ఘట్టంగా నిలిచిపోతుందని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. పట్టాలు, పతకాలు అందుకున్న వారంతా ఆనంద డోలికల్లో తేలియాడారు. యూనివర్సిటీ ప్రాంగణంలో కేరింతలు కొట్టారు. స్నాతకోత్సవంలో పట్టాలు తీసుకోవడమే ఒక మధురమైన ఘట్టమైతే, గవర్నర్ చేతుల మీదుగా వాటిని అందుకోవడం మరచిపోలేనిదని చెప్పారు. ఈ జ్ఞాపకం కలకాలం గుర్తుండి పోతుందని అన్నారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

అపురూప ఘట్టం..

ఈ స్నాతకోత్సవంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి ఎంఏ సోషల్ వర్క్ నుంచి పీజీ పట్టాతోపాటు గోల్డ్ మెడల్‌ను అందుకున్నారు. ఈ సమయంలో వేదిక ముంగిటే ఉన్న ఆమె తనయుడు, ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆనంద పరవశితులయ్యారు. ఆరు పదుల వయసులోనూ తన తల్లి ఒక విద్యార్థిగా పీజీలో గోల్డ్ మెడల్ సాధించడం ఆదర్శనీయమే కాకుండా అద్భుత ఘట్టంగా ఆయన అన్నారు. ఎమ్మెల్యే సతీమణి డాక్టర్ రాజశ్రీ, సోదరి సంహితలు విజయలక్ష్మికి అభినందనలు తెలిపారు.

మరుపురాని రోజు ఇది



మాది ఏలూరు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని సెంట్‌మేరీస్ సెంటనరీ డిగ్రీ కాలేజీలో ఇంగ్లిష్ లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. ప్రొఫెసర్ కావాలనేది నా లక్ష్యం. 2020లో ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేశాను. ఆ తరువాత యూనివర్సిటీలో స్నాతకోత్సవం జరుగలేదు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా ఈ రోజు పీజీ పట్టాను అందుకుంటానని అసలు ఊహించలేదు. జీవితంలో మధురమైన రోజు ఇది.

– శ్రీరాజ శృతి, లెక్చరర్, హైదరాబాద్

సగర్వంగా ఉంది..



పరిశోధన చేసి పీహెచ్‌డీ పొందడం సర్వసాధారణం. అయితే ఆ పీహెచ్‌డీని రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా అందుకునే అవకాశం లభించడం చాలా అరుదు. పీహెచ్‌డీ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో పట్టా పొందాను. గవర్నర్ చేతుల మీదుగా పట్టాను తీసుకోవడం ఇంటిల్లపాదికి సగర్వంగా ఉంది. జీవితంలో మధురమైన జ్ఞాపకంగా నిలిచిపోతుంది.

– సూరవరపు జయసాయి రజిత, గృహిణి, రాజమహేంద్రవరం

సమాజానికి ఉపయోగపడేలా..



2023 సెప్టెంబర్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశాను. రీసెర్చ్ ద్వారా ఈ సమాజానికి నెట్‌వర్క్ సెక్యూరిటీలో ఉపయోగపడాలని భావిస్తున్నాను. ఈ రోజు గవర్నర్ చేతుల మీదుగా పీహెచ్‌డీ అందుకుంటానని కలలో కూడా అనుకోలేదు. నిజంగా ఈ రోజును ఒక అద్భుతంగా భావిస్తున్నాను. జీవితంలో మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

– కోండ్రు మౌనిక, కంప్యూటర్ ఇంజినీర్, రాజమహేంద్రవరం

ఇది మధుర జ్ఞాపకం



ఏ విద్యార్థికైనా డిగ్రీ, పీజీ పట్టాలను స్నాతకోత్సవంలో అందుకోవడం అంటేనే ఒక మధుర జ్ఞాపకంగా నిలిచిపోతుంది. అందులో రాష్ట్ర గవర్నర్ పాల్గొన్న స్నాతకోత్సవంలో పట్టాను అందుకోవడం మాటల్లో చెప్పలేని అనుభూతి. ఇది జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

– ఆగంటి దేవిశైలజ, తెలుగు లెక్చరర్, రాజానగరం

చెప్పలేనంత ఆనందంగా..



ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ విభాగంలో పీజీ పూర్తి చేశాను. ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. గవర్నర్ చేతుల మీదుగా పీజీ పట్టాను అందుకోవడం చెప్పలేనంత ఆనందంగా ఉంది. సొంతంగా సాఫ్ట్‌వేర్ సంస్థ పెట్టాలనేది నా ఆశయం.

– విహారిక, హైదరాబాద్



ఉరిమే ఉత్సాహం

చదువుకున్న డిగ్రీలకు పట్టాలు చేతికి అందితే ఆ ఆనందం చెప్పలేనిది. వర్ణించరానిది. ఆ పట్టాభిషేకానికి చంటి బిడ్డలతో తల్లులు, వీల్‌చైర్‌లో దివ్యాంగులు ఇలా అనేక మంది నన్నయ వర్సిటీకి వచ్చి ఆనందం వ్యక్తం చేశారు. వర్సిటీ ఆవరణలో కేరింతలు కొట్టారు.

– రాజానగరం



పట్టా తీసుకునేందుకు వస్తున్న దివ్యాంగుడు



చంటి బిడ్డతో మహిళ

ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి



పోషణ్‌సాథీలతో హెచ్ఆర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ రాధాకృష్ణ తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మూడు రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న పోషణ్‌సాథీలు గ్రామీణ ప్రాంతాల్లో కిశోర బాలికలకు ఆరోగ్యంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని హిందూస్థాన్ యూనీలివర్ లిమిటెడ్ హెచ్ఆర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ రాధాకృష్ణ అన్నారు. స్థానిక జగదీశ్వరి రెసిడెన్సీలో హిందూస్థాన్ యూనీలివర్ లిమిటెడ్ సామాజిక బాధ్యతలో భాగంగా అమెరికన్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభాత్ పోషణ్ సాథీ కార్యక్రమంలో పోషణ్‌సాథీలకు మూడు రోజుల శిక్షణ బుధవారంతో ముగిసింది. దీనికి ముఖ్య అతిథిగా పాల్గొన్న హెచ్ఆర్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ రాధాకృష్ణ మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్, కడియం, సీతానగరం, కొవ్వూరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కిశోర బాలికలకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పిస్తారన్నారు. అమెరికన్ ఇండియా ఫౌండేషన్ స్టేట్ ప్రాజెక్టు మేనేజర్ కృష్ణ మాట్లాడుతూ కౌమార దశలో పోషకాహారం, రక్తహీనత, రుతుస్రావం, వ్యక్తిగత శుభ్రత, జీవిత చక్రంలోని దశలు, గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కల్పించారు. అమెరికన్ ఇండియా ఫౌండేషన్ బ్లాక్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ వీవీ దీపిక తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



1979-80 బ్యాచ్ విద్యార్థులు

కడియం: పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలసి సందడి చేశారు.. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రాజమహేంద్రవరం ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో 1979–80లో చదువుకున్న విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. దీనికి బుర్రిలంకలోని గోకుల్ నర్సరీ వేదికగా మారింది. తూర్పు, పశ్చిమ, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల నుంచి పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. ఈ కలయికకు కృషి చేసిన వై.రాజేంద్రప్రసాద్, ఎస్.అబ్బిరాజు, శివప్రకాస్, ప్రసాద్ బాబు, భానోజీరావులను సహచరులు అభినందించారు.

సైన్స్ ఒలింపియాడ్‌లో 'శ్రీచైతన్య' ఎంపిక



ఐఏపీటీ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్‌కు ఎంపికైన శ్రీచైతన్య విద్యార్థులు

కంబాలచెరువు: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ముంబయిలోని హెమీ బాబా సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎడ్యుకేషన్ వారు నిర్వహించిన ఐఏపీటీ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్‌లో తొమ్మిది మంది శ్రీచైతన్య విద్యార్థులు ఎంపికైనట్లు రీజినల్ ఇన్‌చార్జులు రామాంజనేయులు, ఉదయ్‌శంకర్ తెలిపారు. ఏపీ నుంచి 45 మంది విద్యార్థులు ఎంపిక కాగా, ఇందులో రాజమహేంద్రవరం శ్రీచైతన్య విద్యార్థులు 9 మంది ఉన్నారన్నారు. వీరు వచ్చే నెలలో జరగబోయే ఇండియన్ నేషనల్ జూనియర్ సైన్స్ ఒలింపియాడ్‌లో పాల్గొన్నున్నారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను శ్రీచైతన్య ఉత్తరాంధ్ర ఏజీఎం ఎమ్‌వీ సురేష్, జోనల్ కో ఆర్డినేటర్ రామారావు, ప్రిన్సిపాల్ నవ్యశ్రీ ప్రత్యేకంగా అభినందించారు.

ఈవోపీఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్ బదిలీ

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ మండల ఈవోపీఆర్డీ ఆర్మ్‌స్ట్రాంగ్ కృష్ణా జిల్లా గంపలగూడేనికి బదిలీ అయ్యారు. అక్కడ ఈవోఆర్డీగా పనిచేస్తున్న బాబూరావును రాజమహేంద్రవరం రూరల్‌కు వేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ బదిలీలు జరిగాయి.

ఏపీలో పాలన అస్తవ్యస్తం: గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి అన్నారు. బుధవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు.

రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం



గైట్ కళాశాలలో హెలీపాడ్ వద్ద గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న కలెక్టర్ మాధవీలత





అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ భరత్‌రామ్

రాజానగరం: తొలిసారిగా జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు స్థానిక గైట్ ఇంజినీరింగ్ కళాశాలలోని హెలీపాడ్ వద్ద కలెక్టర్ కె.మాధవీలత, ఇతర జిల్లా అధికారులు పుష్పగుచ్ఛాలతో బుధవారం ఘన స్వాగతం పలికారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరిగిన 15వ స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు కులపతి హోదాలో గవర్నర్ విచ్చేశారు. స్వాగతం పలికిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎస్పీ పి.జగదీష్, జేసీ ఎన్.తేజభరత్, రాజమహేంద్రవరం ఆర్డీఓ ఎ.చైత్రవర్షిణి, 'నన్నయ' వర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, గైట్ కళాశాల ప్రతినిధులు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం



ఉపాధ్యాయుడు రత్నరాజు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

కడియం: పొట్టిలంక ఎంపీయూపీ స్కూల్ ఉపాధ్యాయుడు కె.రత్నరాజు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయన్ని ఆ స్కూల్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఎంఈఓలు లజపతిరాయ్, నాగేశ్వరరావు పాల్గొని రత్నరాజు సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు సుజాత, బంగారు నాయుడు పాల్గొన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ



ఆహారం పంపిణీ చేస్తున్న ఎలోహి ఫౌండేషన్ సభ్యులు

కడియం: వేమగిరికి చెందిన ఎలోహి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పేదలకు ఆహారం పంపిణీ చేశారు. వేమగిరి నుంచి ధవళేశ్వరం, రాజమహేంద్రవరంలోని కోటిపల్లి బస్టాండ్, గోదావరి గట్టు, గోకవరం బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఉన్న పేదలకు ఆహారాన్ని అందజేశారు. కాశి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తలాటం శ్రీనివాస్, ఆలపాటి సునీల్, ఆనంద్‌పాల్, మధు, దుర్గాప్రసాద్, రవితేజ, బుజ్జి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గద్దర్ సేవలు అజరామరం

కడియం: పీడిత వర్గాలకు అండగా నిలిచిన దివంగత గద్దర్ సేవలు అజరామరమని పలువురు వక్తలు కొనియాడారు. వేమగిరిలో ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో గద్దర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. స్థానికులు పాల్గొన్నారు.

జేఏసీ చైర్మన్‌కు సన్మానం



బండి శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు

ధవళేశ్వరం: ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ బండి శ్రీనివాసరావును ధవళేశ్వరం ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. గురువారం ధవళేశ్వరానికి వచ్చిన ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి స్థానిక అసోసియేషన్ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. బండి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రామ్మోహనరావు, పీవీ కృష్ణ, ధవళేశ్వరం శాఖ అధ్యక్షుడు ఎస్.జయకుమార్, సహాధ్యక్షుడు బి.లక్ష్మణుడు, ఉపాధ్యక్షుడు ఎస్.సత్తిరాజు, నాయకులు పి.శేషుకుమార్, సయ్యద్ బాజీ, ఎన్.సతీష్‌కుమార్, కె.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.